కథ

# తనదాకా వస్తేగాని...

గుజ్జు సురేష్ రెడ్డి

**“సిక్సర్” అంటూ కామెంట్రీ వినబడగానే మ్యాచ్ చూస్తున్న గోపాలంకి అరికాలిమంట నెత్తికెక్కినట్లయింది. టీవీ ఆఫ్ చేసి, రిమోట్ అసహనంగా ప్రక్కన పడేసాడు.**

“దద్దమ్మలు..యాడ్స్‌లో యాక్ట్ చేయడానికి మాత్రం ఆస్కార్ అవార్డ్‌పొందిన నటుల్ని మించిపోతారు. ఆ ప్రతిభ ఆటలో మాత్రం పూజ్యం. సునాయాసంగా గెలవల్సిన మ్యాచ్‌ల్ని కూడా పీకలమీదకు తెచ్చుకొని చివరికొచ్చేసరికి అవతలవారికి గెలుపుని అప్పనంగా అప్పజెప్పేస్తారు” ఇండియా మ్యాచ్ ఓడిపోయినందుకు తన ఉక్రోషాన్ని వెళ్లగ్రక్కుతున్నాడు.

“ఎవరి మీదా చిర్రుబుర్రులు” టీ అందిస్తూ అడిగింది పంకజం.

“ఇంకెవరు..ఉన్నారుగా మన క్రికెట్ వీరులు. ఇదిగో నువ్వు నాకు ఈ టీ ‘కప్పు’ ఇచ్చినంత సులువుగా ‘కప్’ను శ్రీలంక చేతిలో పెట్టేసారు”

“ఓడిపోవడం మన టీంకు మాత్రం ఇష్టమటండి, గెలుపోటములు సహజం” దేశాభిమానాన్ని చాటుకుంది పంకజం.

“నీలాంటివాళ్ల సపోర్ట్ ఎక్కువైపోయే, తమ ప్లేసులకొచ్చిన ఇబ్బందేమీలేదని బద్ధకస్తుల్లా తయారౌతున్నారు” అంటూ టీని కాస్త సిప్ చేసి “ఏంటిది? టీ అసలు వేడుందా?” క్రికెట్ కోపాన్ని పంకజం మీదకి వదిలాడు.

గోపాలం ప్రవర్తన మొదట్నుంచి తెల్సిన పంకజమేమీ ఆ మాటకు బెదరలేదు. “మీరే చాలా వేడిగా వున్నారు. ఇంక టీ వేడితో పనేముందని!” చురక అంటిస్తూ వెళ్లింది.

“చేసే పనిలో కొంతలో కొంతైనా భయం, భక్తి లేకపోతే ఇలాగే తగలడతాయ్” విసుక్కుంటూ బయటకి వెళ్లిపోయాడు.

పెళ్లైన దగ్గర్నుండి అతని విసుగును భరించడం తనకీ విసుగనిపించినా తప్పటం లేదు. మొన్నటికి మొన్న సినిమాకని తీసుకెళ్లాడు. చూడాలనుకున్న సినిమా ప్రదర్శించే థియేటర్ దూరంగా ఉండడం వలన సిటీబస్ ఎక్కాల్సి వచ్చింది. అప్పటికి పిక్చర్ బిగిన్ కావడానికి ఇంకా అరగంట మాత్రమే సమయముంది. టికెట్స్ తీస్తూ కండక్టర్‌ని అడిగాడు గోపాలం. థియేటర్ వద్దకు వెళ్లడానికి ఏమాత్రం సమయం పడుతుందని? ‘పది నిమిషాలలో వెళ్తుంది’ అని కండక్టర్ చెప్పాడు.

అది విన్న పంకజం గుండెల్లో ఏదో గుబులు ప్రారంభమయ్యింది. భగవంతుడా! అంటూ మనసులో తలచుకుంది.

కానీ మనమొకటి తలిస్తే దైవం వేరొకటి తలచిందన్నట్లు బస్సు కిర్ర్...మంటూ సడన్‌గా ఆగింది. కారణమేమిటని చూస్తే ట్రాఫిక్ జామయ్యింది. చాలా దూరం నుండి వాహనాలన్నీ అడ్డదిడ్డంగా ఆగిపోయి వున్నాయి. ఒక అయిదు నిమిషాలు గడిచింది. కానీ ట్రాఫిక్ ఇంత తొందరగా క్లియరయ్యేలా లేదు.

గోపాలం ఒకసారి వాచీ చూసుకున్నాడు. సినిమాకి టైం దగ్గర పడుతుంది. అతని మొహంలో క్రమక్రమంగా వస్తున్న మార్పు, పంకజం మనసులో ఆందోళన రేపసాగింది.

తన భర్తవల్ల ఏ క్షణంలో ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అని పంకజం భయపడసాగింది.

గోపాలం కండక్టర్‌ని “బస్సు ఎప్పుడు కదులుతుంది?” అడిగాడు.

“ట్రాఫిక్ క్లియరైన తర్వాత” చెప్పాడు కండక్టర్.

“అదెప్పుడు క్లియరవుతుంది?” కాస్త గట్టిగా అడిగాడు.

“అదెలా చెప్పగలం” భృకుటి ముడిచి చూస్తూ అన్నాడు.

“అలాంటప్పుడు పది నిమిషాలలో వెళ్తుంది, అని బస్సెక్కినప్పుడు ఎందుకు చెప్పావ్..సినిమా టైమిక్కడే అయిపోయింది” ఈసారి మరికాస్త సౌండ్ పెంచాడు గోపాలం.

అనలే ట్రాఫిక్ జామయి చుట్టూ వాహనాల హోరుకు చెవులు దిమ్మెక్కేలా వున్న కండక్టర్‌కు ఆ మాట సమ్మెటతో తలమీద మోదినట్లయింది.

“ఏంటి..సినిమాకి టైం అయిపోతుందా.. అందుకని బస్‌ను ముందున్న వాహనాలపై నుండి హైజంప్ చేయించమంటారా, లేకపోతే హెలికాప్టర్ రప్పించి మిమ్మల్ని థియేటర్‌లో దింపేసే ఏర్పాట్లు చేయించమంటారా” అని రెండు చేతులు కట్టుకొని వెటకారాన్ని జోడించి అరిచాడు. కండక్టర్ మాటలకు బస్సులో ప్రయాణీకులు నవ్వుకోవడం గమనించాడు. దాంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది గోపాలం పరిస్థితి.

“ఆ మాత్రం దానికి ముందుగా ప్రగల్భాలు పలకడం దేనికి అయిదు నిమిషాల్లో వెళ్ళిపోద్ది, పది నిమిషాలలో వెళ్ళిపోద్దని”

బస్సులోని వారంతా వీళ్లనే చూస్తున్నారు.

“ఓయ్..చూస్తే చదువుకున్న వాడిలాగున్నావు..ఒకదానికొకటి పొంతన లేకుండా మాట్లాడ్తావేమిటి?” గోపాలంపై చూపుడు వేలుని ఎక్కుపెట్టి అన్నాడు కండక్టర్.

గోపాలంలో బి.పి.రైజయ్యింది. “వేలు చూపించి మాట్లాడ్తావేంటి రెస్పెక్ట్ లేకుండా! వేలకు వేలు జీతాలు బొక్కి బ్రతుకుతున్నారంటే మా పాసింజర్స్ దయవల్లనే. కంప్లైంట్ ఇస్తే ఉద్యోగం ఊడుతుంది” అని చొక్కా పట్టుకున్నాడు ఆవేశంతో.

దాంతో గొడవ ముదిరి పాకానపడింది. కండక్టర్‌కు సపోర్టుగా ప్రక్క ప్రక్కగా ఆగిన బస్-డ్రైవర్‌లు, కండక్టర్‌లు వచ్చి చేరారు.

పంకజం “ఆగండి! గొడవెందుకు..వద్దండి” అని ఎంత వారిస్తున్నా గోపాలం వినిపించుకోలేదు.

బస్‌లో పాసింజర్స్ మాత్రం భలే మంచి కాలక్షేపములే అన్నట్లు కంటిపై రెప్ప వేయకుండా చెవులు నిక్కించి మరీ వింటున్నారు.

చివరికి చిలికి చిలికి గాలివానై గొడవ పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళింది. జరిగిన సంఘటన మళ్లీ కళ్లముందు కదలాడే సరికి ‘ఎలారా భగవంతుడా, ఇతన్ని మార్చడం’ అని ఆలోచిస్తుంటే ఇంతలో వాళ్ల పిన్ని వచ్చింది.

“ఏమిటీ..పరధ్యానంగా వున్నావ్? ఏం జరిగింది?” అడిగింది.

“నా గొడవ నీకెందుకులే పిన్ని. చాలా రోజులకు వచ్చావ్? ఏంటి విశేషం. అయినా ఈ ఊళ్లోనే వుంటూ ఏదో పొరుగూరి నుండి చుట్టంలా రావడమేమిటి? తరచూ వస్తూ పోతూ ఉండొచ్చుగా”

“వస్తాన్లేవే..మీ వారేరి?”

“ఇప్పుడే అలా వెళ్లారు. ఏమిటో ఆయనను ఎలా మార్చాలో అర్థం కావడం లేదు” అంది పంకజం.

“నీలో నువ్వే సతమతమవక విషయమేంటో చెప్పు” చేతులు పట్టుకొని అడిగింది.

“ఈ మ్యాచ్ మేం గెలుస్తాం అని ఓడిపోయినా, బస్ వాడు చెప్పిన టైంకి- తీసుకెళ్లకపోయినా, డాక్టర్ ఏదైనా జ్వరానికి గాని, జబ్బుకి గాని రెండురోజుల్లో నయమవుతుందని చెప్పిం తర్వాత, మూడవరోజు వరకు తగ్గకపోయినా, అలా జరగడానికి కారణం ఏమిటి అని ఆలోచించకుండా అందరితోను అనవసరమైన తగవులాడి తలనొప్పులు తెస్తున్నారు” డీలాగా మొహం పెట్టి వాపోయింది.

“ఈ మాత్రందానికే బెంగెందుకు..చిన్న చిట్కా చెప్తాను. సమయం చూసి అమలుపరచు” చెప్పింది.

★ ★ ★

ఆ రోజు గోపాలం చాలా ఉత్సాహంగా కనిపించాడు. విషయమేమిటని పంకజం అడిగితే ఎన్నాళ్ల నుంచో ఊరిస్తున్న ప్రమోషన్ ఇవ్వాల్టికి సిద్ధించిందని ఉబ్బితబ్బిబ్బ

వుతూ చెప్పాడు.

పంకజం మెదడులో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఇదే మంచి తరుణమని భావించి "ఏవండీ! ఇదంతా ఆ సింహాద్రప్పన్న చలవేనండి. ప్రమోషన్ వస్తే కొండకి నడిచి వస్తామని మొక్కుకున్నాం కదా! మీ చేతికి వెండి కడియం కూడా వేసుకున్నారు. వెంటనే మొక్కు తీర్చుకుందామండి" చేతులు జోడించింది ఎదురుగా వున్న దేవుని పటం వైపు చూస్తూ.

"అలాగే..ఈ శనివారం సెకండ్ సాటర్ డే కదా, ఆ రోజు వెళదాం" ఆనందంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

అన్నట్టుగానే శనివారం బయలుదేరడానికి సంసిద్ధులవుతున్నారు.

"ఇదిగో పంకజం..నిమ్మకాయొకటి నీ దగ్గర వుంచు. అసలే నీకు బస్సు ప్రయాణం సరిపడదు" అద్దం ముందు తలదువ్వుకుంటూ చెప్పాడు.

"బస్సంటున్నారేమిటి..మనం కాలినడకన వస్తామని మొక్కుకున్నాం" మళ్లీ గుర్తు చేసింది.

"అబ్బబ్బా..నేనేమీ కాదనట్లేదే పిచ్చిమొహమా! కొండ పైకి నడిచే వెళ్తాం. కానీ కొండవరకు వెళ్లాలంటే బస్సెక్కాలిగా!" భార్య అమాయకంగా మాట్లాడ్తుందనుకొని ముసి ముసిగా నవ్వుకున్నాడు.

"అపచారం..అపచారం! తప్పండి! అలా మాట మార్చరాదు. మనం మొక్కింది ఇంటివద్దనుంచి కొండపై వరకు కాలినడకన వస్తామని, ఇప్పుడు అలా కాదంటే వచ్చిన ప్రమోషన్ కాస్త చేజారిపోగలదు" లెంప లేసుకుంది.

ఆ మాటకు పిడుగుపడినట్లు అదిరిపడ్డాడు. "అది కాదే..అది సాధ్యమయ్యే పనేనా" గొంతులోంచి మాట భయంగా వచ్చింది.

"అంతా వరాహ లక్ష్మీ నరసింహస్వామే చూసుకుంటాడు. ఆయన కృపాకటాక్షాలు మన మీద వుండాలే గానీ, చెప్పుల్లేకుండా నడిచినా అస్సలు నడిచినట్లే ఉండదు" ట్రిప్పుకో పాయింట్ని జోడిస్తూ, గీతలో కృష్ణుడిలా బోధించసాగింది.

"చెప్పుల్లేకుండానా! వామ్మో! ఎంత లేదన్నా ఇరవై కిలోమీటర్లు వుంటుంది. ఈరోజు నా ప్రాణాలు హరీ అంటాయేమో" నోటిలోనే సణుక్కున్నాడు. ఎక్కడ కాదంటే వచ్చిన ప్రమోషన్ పోతుందనే భయంతో.

మెల్లగా మనసులో లేని ధైర్యాన్ని తెచ్చుకున్నాడు 'సి.ఎం. కావడంకోసం రాజశేఖర్‌రెడ్డి 1600 కి.మీ. నడవగా లేనిది ఉద్యోగం కోసం 20 కి.మీ. నడవలేనా!' అనుకుంటూ అడుగు ముందుకు వేసాడు.

అలా కొంతదూరం నడిచేసరికి కాళ్లల్లో సలపరం మొదలయింది. అసలే ఎండాకాలం కావడంతో సూర్యుడు కళ్లెర్ర జేసి చూస్తున్నాడు. తారురోడ్డు ఎండకి కాలుతోంది.

"పంకజం. నోరెండి పోతోందే..కూల్‌డ్రింకైనా త్రాగుదాం" అడిగాడు బ్రతిమాలినట్లుగా మొహం పెట్టి.

అలా అనీ అనడంతో గోపాలాన్ని కోపంగా చూస్తూ, చంద్రముఖి సినిమాలో జ్యోతికలా కళ్లు పెద్దవి చేసి "ఉపవాసంతో వస్తానన్నమాట ఉపసంహరించి కూల్‌డ్రింకులు, బాదంగీర్‌లు రుచి చూస్తానంటావా" అని గట్టిగా అనేసరికి చింతనిప్పుల్లా వున్న ఆ కనుగుడ్లను చూసి భయంతో కళ్లు మూసేసుకుని భయంతో వణికిపోయాడు.



"ఒళ్లంతా చెమటలు పట్టి, సత్తువంతా ఇగిరిపోతుంటే అడుగెలా ముందుకు పడుతుందిరా భగవంతుడా" బలవంతంగా పాదాలను ముందుకు కదల్చసాగాడు. చచ్చిన తర్వాత యమధర్మరాజు నరకంలో శిక్షలు వేస్తాడంట..ఇవి నా పాలిట యమధర్మ'రాణి'లా వుంది. బ్రతికుండగానే హింసిస్తుంది మనసులోనే వాపోయాడు.

"పంక..జం..నువ్వేమన్నా సరే ఇక నడవలేనే..సొమ్మసిల్లి పడిపోయేలా వున్నాను" రోడ్డు ప్రక్కన వున్న ఓ చెట్టు మొదలున కుప్పకూలిపోయాడు.

"సింహాద్రప్పన్నా..నన్ను క్షమించు..నా తప్పు నాకు తెలిసొచ్చింది. ఇప్పటివరకు చాలామంది మీద మంచి, చెడు ఆలోచించకుండా అహంకారంతో ప్రవర్తించాను. మామూలు విషయాలను కూడా పెద్దవి, పెద్దవి చేసి రాద్ధాంతం చేసాను. అది ఎంత తప్పో నీ దయవలన అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. పం..క..జం..ఇంక చాలు, నాకు బుద్ధొచ్చింది" లెంపలేసుకున్నాడు.

గోపాలంలో వచ్చిన మార్పుకి పంకజం సంతృప్తి చెందింది, మనస్సులోనే వాళ్ల పిన్నికి కృతజ్ఞతలు చెప్పుకుంది.

అప్పటికే కళ్లు తెరుస్తున్న శ్రీవారుకి తను బ్యాగులో నుండి వాటర్ బాటిల్‌ను తీసిచ్చింది.

"క్షమించండి. ఇదంతా జరగడానికి నేనే కారణం" జాలిగా చూస్తూ అంది.

"పంకజం..అంతా మన మంచికే" అంటూ బాటిల్‌లో నీళ్లు గొంతులో పోసుకోసాగాడు.